**ఓ పక్క** స్నేహితురాలి పెళ్ళి అవుతుంటే రమ వెక్కి వెక్కి ఏడుస్తోంది. చూసిన వాళ్ళంతా ఇద్దరికీ చాలా స్నేహం కాబోలు అనుకున్నారు. రమ ప్రెజంటేషన్ పట్టుకొని పెళ్ళికూతురు శివాని దగ్గరకు వెళ్ళింది. మాట్లాడబోయింది గాని నోరు పెగల్లేదు. శివాని ఆశ్చర్యపోయింది.

రమ, శివాని ఒకే కాలేజీలో లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. ఉమెన్స్ హాస్టల్లో ఇద్దరూ ఒకే రూములో ఉంటున్నారు. అన్ని విషయాలు ఒకరికొకరు అరమరికలేకుండా చెప్పుకుంటారు. రమ సెలవు పెట్టి హైదరాబాదు వెళ్ళిన సమయంలో ఈ పెళ్ళి నిశ్చయం చేసుకుంది శివాని. పెళ్ళికొకుకు ఎవరని రమ ఎన్నిసార్లు వ్రాసినా శివాని "న స్పెన్సు. నువ్వే చూద్దువు గాని. త్వరగా వచ్చేయ్" అని వ్రాసిందే తప్ప, పెళ్ళికొడుకు గురించి తెలియనివ్వలేదు.

పెళ్ళికొడుకును చూచిన తర్వాత రమ 'శివాని చాలా తొందరపడింది' అనుకుంది. రమ అంతగా బాధపడటానికి వేరే కారణముంది. ఇంత చక్కగా పెళ్ళిపీటలమీద కూర్చున్న పెళ్ళికొడు కెవరో తనకి తెలుసు. ఇదివరకే రమ ఇతని గురించి శివానీకి చెప్పింది. శివానీ తెలి సే ఎలా ఒప్పుకుంది? తన పిన్నికూతురుని వలలో వేసుకుని, తిరిగి నన్నాళ్ళు యథేచ్ఛగా తిరిగి, వాళ్ళచేత నెట్టి వేయబడి, ఇపుడు పెళ్ళికి తయారయ్యాడు. వాడు తయారయ్యాడు సరే, దీని బుద్ధి ఏమయింది?

భోజనమైనా చేయకుండా ఇంటికి వచ్చిందే కాని, మనసు మనసులో లేదు రమకి. పిన్నికూతురు విమల ఇంట్లో జరిగిన సంఘటన గుర్తు వచ్చింది రమకి.

అప్పుడు రమ వాళ్ళింట్లో ఉండి చదువుకునేది. అక్కడే చూసింది ఈ పెళ్ళికొడుకు గోపాలరావును.

×× ×× ××

రేవతి ఆ లెక్చరరు వలలో ఎలా పడిందోగాని, ఆ సంఘటన ఇంట్లో అందరికీ ఒక సమస్యగా తయారయింది.

మొదటినుంచీ మంచిపేరున్న కుటుంబం వారిది. పెద్ద పట్నమూ కాక, పల్లెకాక మధ్యరకంగా ఉన్న ఆ ఊళ్ళో వారి కుటుంబానికి మంచి పరపతి ఉంది. రేవతి తండ్రి డాక్టరు కావడం, అందరినీ ఆప్యాయంగా పలకరించి సహాయం చేయటం ఇందుకు కారణం. ఆయనకి మంచి ప్రాక్టీసు ఉంది. ఊరిలో మంచి డాక్టరు, హస్తవాసి మంచిది అని పేరు తెచ్చుకున్నాడు.

ఆయన పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవడం, పెళ్ళిళ్ళు చేయటంకూడా అయింది. పెద్దకొడుకు రాజు. రెండోపిల్ల రేవతి..వీరి పెళ్ళిళ్ళు అవగానే తల్లి చనిపోయింది.

రాజుకి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్ళు కలిగారు. రేవతికి ముగ్గురూ మగపిల్లలే. మూడు సంవత్సరాలకి ముగ్గురూ పుట్టేశారు. తర్వాత రేవతి భర్త ఆపరేషన్ చేయించుకున్నాడు.

పట్నంలో రేవతి భర్తకి ఉద్యోగం. అక్కడే కాపురం పెట్టుకొని పుట్టింటికి వస్తూపోతూ ఉండేవారు. మొత్తానికి రేవతి ఎక్కువకాలం పుట్టింట్లోనే ఉండేది. భర్త ఏమీ అనేవాడు కాదు. మామగారిమీద గౌరవం అతనికి. ఏమంటే ఏమనుకుంటారో అని భయం. ఒక్కర్తే కూతురు కావటంచేత ఆమెను ఇంట్లో వెవ్వరూ ఏమీ అనేవారు కారు. వదినగారు బాగా ఆదరించేది. రేవతి అన్నగారు అన్ని విషయాలూ తండ్రి చూసుకుంటున్నాడు కదా మనకెందుకు అన్నట్లు ఊరుకునేవాడు. పుట్టింటికి వచ్చి రేవతి ఎవరినీ అడగనక్కర్లేకుండానే తనకి కావల్సినవన్నీ కొనుక్కొనేది. తర్వాత ఆ కొట్టువాళ్ళు వచ్చి డాక్టరుగారి దగ్గర డబ్బు పట్టుకుపోయేవారు.


పట్నంలోకూడా రేవతి ఇంటిగురించి పట్టించుకునేది కాదు. భర్త ఆఫీసుకు వెళ్ళగానే పిల్లల్ని ఇంట్లోపెట్టి తాళంవేసి పెత్తనాలకి పోయేది.

ఆ పిల్లలు ఇంట్లో చేసే అల్లరి అంతా ఇంతా కాదు. ఇనుపబీరువా ఎక్కి కూర్చునేవా డొకడు, కటకటాలు పట్టుకుని పైకి ఎక్కేసేవా డొకడు. పెద్దవాళ్ళిద్దరూ మూడోవాడిని చెరో రెక్కా పట్టుకుని ఈడ్చేసేవారు. నీళ్ళు తెచ్చి నెత్తిన పోసేవారు. వాడికి మాటలు రాకపోవడంతో తల్లి వచ్చిన తర్వాత ఏమీ చెప్పలేకపోయేవాడు.


ఇవన్నీ రేవతి ఏమీ పట్టించుకునేది కాదు. వంటా, పనీ చేయడానికి మనిషిని పెట్టుకుంది.

ఉన్నట్లుండి రేవతికి బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది. పెళ్ళి అయేనాటికి ఇంటరు పాసయింది. తర్వాత చదువు ఆగిపోయింది. ఇప్పుడు మళ్ళీ ఎందుకు చదవకూడదు? బి.ఎ. ప్రైవేటుగా కట్టవచ్చును కదా! భర్త వచ్చాక అడగాలి అనుకుంది.


మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు రాజారావు. టేబుల్‌మీద అన్నీ సక్రమంగా



# లోపం ఎవరిది?



కె. సరోజిని




పెట్టి పక్కనే కుర్చీలో కూర్చుంది రేవతి. ఆశ్చర్యపోయాడు రాజారావు. సాధారణంగా ఇటువంటి పరిస్థితి ఉండదు. పనిమనిషి టేబులుమీద అన్నీ మూతపెట్టి వెళ్ళిపోతే, తనే వడ్డించుకుని తినడం జరుగుతుంటుంది. ఈరోజు ఏదో విశేషం ఉంది అనుకున్నాడు.

"ఏమిటి విశేషం? ఈరోజు రాణీగారు ఇంట్లోనే ఉన్నారు" అన్నాడు నవ్వుతూ.

"మీకంతా వేళాకోళమే. నే నెపుడూ వడ్డించలేదా మీకు?" అంది రేవతి.

"ఎందుకు వడ్డించలేదు. వడ్డిస్తూనే ఉన్నావుగా చీవాట్లు!"

"మీ రెపుడూ అలాగే అంటారు. భార్య, భర్త ఆమాత్రం అనుకోకుండా ఎలా ఉంటారు?" అంది రేవతి.

"ఎలా ఉంటారు!" అన్నాడు రాజారావు క్వొశ్చన్‌మార్కు మొహం పెట్టి.

నవ్వేసింది రేవతి.

"బంగాళాదుంపల వేపుడు మీ కిష్టం. ఇంకొంచెం వేసుకోండి" అంది. పెరుగు ఇంకో గరిటె ఎక్కువే సింది. ఇదంతా వింతగా ఉంది రాజారావుకి. చెయ్యి కడుక్కొని నేప్‌కిన్‌తో తుడుచుకుంటూ డ్రాయింగ్ రూమ్‌లోనికి వచ్చాడు. ఇంతలో వక్కపొడి డబ్బాతో రేవతి వచ్చింది. ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు.

"ఏమండీ" అంది రేవతి.

"ఊఁ!" అన్నాడు రాజారావు మాగజైన్ చూస్తూ.

"నే నో మాట అడగనా?" అంది రేవతి.

"ఒకటేమిటి? రెండు అడుగు" అన్నాడు రాజారావు.

"అదికాదండీ. నాకు బి.ఎ. చదవాలని ఉంది" అంది రేవతి.

ఈసారి నోరు వెళ్ళబెట్టాడు రాజారావు. ఏ చదువూ లేకుండానే ఇంట్లో ఉండదు. ఇంక చదువు మొదలుపెడితే మన గతి-అనుకున్నాడు మనసులో.

"మాట్లాడరేమండీ?" అంది రేవతి.

"మీ నాన్నగారిని అడిగేవా?" అన్నాడు. మామగారంటే ఎంతో గౌరవం రాజారావుకు.

"ఇంకా అడగలే దనుకోండి. ముందర మీరు ఒప్పుకుంటే తర్వాత నాన్నగారిని అడుగుదామని" అంది.

"అడిగిచూడు. ఆయన ఒప్పుకుంటే నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు. 'ఉందన్నా మానుతుంది కనుకనా" అనుకుని ఊరుకున్నాడు.

మర్నాడే రేవతి తండ్రి దగ్గరకి వెళ్ళింది. తన కీ అయిడియా వచ్చినట్లు, భర్త ఒప్పుకున్నట్లు చెప్పింది.

ప్రైవేటుగా కట్టడానికి తండ్రి అన్నీ ఏర్పాట్లు చేసి, పట్నంలో ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేటట్లుగా ఒక లెక్చరరుని ఏర్పాటు చేశాడు. నెల జీతం ఎంతయినా తండ్రే ఇచ్చుకుంటాడు కనుక రేవతికి ఆ బాధకూడా లేదు.

రోజూ సాయంకాలం వచ్చి పాఠాలు చెప్పి వెళ్తుండేవాడు ఆ లెక్చరరు. ఆయన పేరు గోపాలరావు. గోపీ అని పిలిపించుకోవడం ఇష్టం. అతనికి ఇంకా పెళ్ళి కాలేదు. ట్రిమ్‌గా డ్రెస్ అయి స్కూటరుమీద వచ్చేవాడు.

రేవతి పెద్ద అందకత్తె కాదుకాని, ముగ్గురు పిల్లలు పుట్టినా ముప్పయ్యేళ్ళు నిండలేదు. బింకం చెడలేదు. చామనచాయ రంగులో పుష్టిగా, పుష్టికి తగిన పొడుగుతో ఆకర్షణీయంగా ఉంటుంది. పెద్ద వాలుజడ. కోల ముఖం. పెద్ద కళ్ళుగల రేవతి కలవారింటి ఆడపడుచు, పెద్ద ఉద్యోగస్తుని భార్య అవటంతో అలంకరణకేమీ కొదవలేదు.

సాయంకాలం ట్యూషన్ వేళయేసరికి చక్కగా డ్రెస్ అయి కూర్చునేది. రోజూ ఒక గంట సేపు పాఠాలు చెప్పి, ఏమైనా సందేహాలుంటే అడగమనేవాడు గోపాలరావు. మొదట్లో కొంచెం మొహమాటపడినా క్రమంగా తెలియనివి అడిగి చెప్పించుకోవడం మొదలుపెట్టింది.

అతనుకూడా కాలేజీ విషయాలూ అవీ చెప్తుండేవాడు. రెండు నెలలయేసరికి బాగా చనువయింది ఇద్దరికీ.

ఓ రోజు రాజారావు అడిగాడు—"ఏమోయ్! ఎలా ఉంది చదువు?" అని.

"అబ్బ! ఇన్నాళ్ళకి గుర్తు వచ్చిందన్నమాట నేను చదువుకుంటున్నట్లు" అంది రేవతి.

"మర్చిపోతే కదా గుర్తురావడానికి" అన్నాడు.

"ఆయన చాలా బాగా చెప్తున్నాడండీ" అంది.

"ఏమిటి? కబుర్లా?" అన్నాడు.

"అలా ఎందు కనుకుంటారు? ఆయన పాఠాలు బాగా చెప్తారండీ. ఎంత బుర్రలేనివాళ్ళకయినా ఇట్టే అర్థమౌతాయి. నేను చదువు మానేసి చాలా కాలమయింది కదా! అయినా త్వరగానే ఫాలో అవుతున్నాను" అంది రేవతి.

"అంతేకదా! ఆయన నిన్ను ఫాలో అవుతున్నాడేమోనని!" నాలిక బుగ్గల్లో పెట్టి కొంటెగా చూశాడు.

"పోండి. మీరు మరీనూ!" అంది.

"పోను. వస్తాను."

×× ×× ××

ఆ రోజు గోపాలరావు రావటం ఆలస్యమైంది. రేవతికేమీ తోచలేదు. ట్యూటరు రాకపోతే తనకి తోచకపోవటమేమిటి? అనుకుంది.


అన్నట్లు ఈ రోజు ఆయనకూడా రాలేదేమిటి? అనుకుంది.


రోజూ ట్యూషన్ గొడవలో ఆయన రాక తెలిసేది కాదు. ఈరోజు ఖాళీగా ఉండడంతో ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. రాజారావుని, గోపాలరావుని పోల్చి చూడడం మొదలుపెట్టింది.

రాజారావు కొంచెం పొట్టి. తను పొడుగు అవడంచేత అలా కన్పిస్తాడు అనేవారు అందరూ. కానీ తనకంటె తెలుపు. చక్కని నొక్కుల జుట్టు. అతను బాగులేడని ఎవరూ అనలేరు.

గోపాలరావు పొడగరి. నలుపనే చెప్పాలి. నున్నటి జుట్టు విరిచి వెనక్కి దువ్వుతాడు. దేవానంద్‌లా అద్దం దగ్గర కూర్చుని ప్రాక్టీస్ చేశాడో, ఏమో అంతా సినిమాహీరోలా చేస్తుంటాడు. మధ్య మధ్య మాట్లాడుతూ భుజాలెగరేస్తాడు.

'ఊఁ! అలాగా!' అన్న అర్థం వచ్చేలా అన్నప్పుడు తల కొంచెం కిందికి దించి, కళ్ళు పైకెత్తి క్రింది పెదవి పంటితో నొక్కుతాడు. ఆ భంగిమకి ఆ ఎదుట ఉన్న స్త్రీ కలవరపడక మానదు. నవ్వాల్సివస్తే గొల్లున నవ్వుతాడు. ఏదైనా ప్రశ్నవేస్తే పక్కనుంచి




లేచి మనుమడిని దగ్గరగా తీసుకున్నారు. "నాయనా! శరత్! ఇన్నాళ్ళ నుండి నేను చెయ్యలేని పని నువ్వు చేశావు"అన్నారు డగ్గుత్తికతో.

××× ××

నెలరోజులు గడిచాయి. రమ శివానీని కలవలేదు. కొత్తగా పెళ్ళి అయిన దంపతులు-వాళ్లని డిస్టర్బు చెయ్యడం బాగుండదని ఊరుకుంది.

ఆ రోజు రమ కాలేజీకి వెళ్ళేసరికి లెక్చరర్లంతా గట్టిగా మాట్లాడేసుకుంటున్నారు. శివానీ అన్న పేరు మాత్రం రమకి విన్పించింది. రమని చూసి అందరూ సైలెంటై పోయారు. బెల్ అవగానే ఎవరి క్లాసులకు వాళ్ళు వెళ్ళి పోయారు. తెలుగు లెక్చరర్ మిగిలిపోయింది. ఆమె దగ్గరకు వెళ్ళి అడిగింది రమ-

"నేను వచ్చేసరికి అందరూ ఏమిటి మాట్లాడుతున్నారు?"అని.

"సారీ.రమా! నువ్వేమనుకోవు కదా! శివానీ డైవోర్సుకి అప్లై చేసిందని అంతా అనుకుంటున్నారు."

"నిజమా?"

"నిజమే మరి. మన పొలిటిక్సు లెక్చరరు తండ్రి అడ్వకేటు కదా! ఆయన ద్వారా డైవోర్సుకి అప్లై చేసిందిట. పుట్టింట్లో ఉందిట!"

మతి పోయింది రమకి. లీవు లెటరు వ్రాసి తెలుగు లెక్చరరుకి ఇచ్చింది ప్రిన్సిపాలు కివ్వమని. కాలేజీ దాటి ఇవతలకి వచ్చి రిక్షా చేయించుకుని శివానీ వాళ్ళింటికి వెళ్ళింది. శివానీ ఎదురుగా హాల్లోనే కూర్చుని నవల చదువుతున్నట్లుంది. గుమ్మంలో జోళ్ళు చప్పుడు అవగానే ఇటు తిరిగింది. రమని చూడగానే లేచి వచ్చి రమని పట్టుకుని భోరున ఏడ్చేసింది.

"ఊరుకో! శివా! ఏం జరిగింది అసలు? కాలేజీలో వినగానే నమ్మలేకపోయాను. నేను విన్నది నిజమేనా?" అని అడిగింది రమ. నిజమే అన్నట్లు తల ఊపింది శివానీ.

"తొందర పడుతున్నావేమో,శివా!" అంది రమ.

"రమా! ఏం జరిగిందో వింటే నువ్వు ఆ మాట అనవు. పది రోజులు హనీమూన్‌కి బెంగుళూరు, మైసూరు అన్నీ తిరిగి వచ్చాము. ఎంతో చక్కగా జరిగింది. ఇంటికి వచ్చాము. ప్రతి రోజు రాత్రి లేటుగా ఇంటికి రావడం. ఏదో వంక చెప్పటం. నేను అలాగే ఎడ్జస్టు అయ్యేదాన్ని. ఒక రోజు క్లబ్బులో పార్టీకి రమ్మన్నాడు. నేను రానని ఎంత చెప్పినా వినలేదు. అనవసరంగా గొడవ ఎందుకని వెళ్ళాను. నన్ను ఒకచోట కూలేసి వెళ్ళిపోయాడు. ఎక్కడా కన్పించలేదు. నాకు ఎంత సిగ్గేసిందో. కొత్తగా పెళ్ళయినవాళ్ళం-ఇద్దరం ఒకచోట ఉంటే ఎంత బాగుంటుంది? ఆ మాటే లేదు ఆయనకి. చాలా సేపటికి అరడజను మంది ఆడవాళ్ళతో వచ్చి నన్ను వాళ్ళకి పరిచయం చేశాడు.

"ఓల్డ్ ఫాషన్డ్" అని ఒకర్తె.

"నీకెలా నచ్చిందీ"అని ఇంకొకరు.

"ఆమె ఒకర్తె కాదుగా. మనందరమూ లేమూ గోపీకి"అని ఇలా సాగాయి వారి మాటలు. ఆయన వాళ్ళను ఏమీ అనలేదు. నన్ను సపోర్టూ చెయ్యలేదు.

సిగ్గుతో కుంచించుకు పోయాను. ఇద్దరం ఇంటికి వచ్చేసరికి రాత్రి ఒంటి గంట అయ్యింది. వెంటనే అడిగేశాను-

'ఏమిటీ పద్ధతి? పెళ్ళి ముందు జరిగినదానికి ఏమీ అనుకోను. పెళ్ళి అయ్యాక తిరుగుళ్ళేనా? అటువంటపుడు పెళ్ళి ఎందుకు చేసుకున్నారు' అని.

'నోరు ముయ్. నన్నడగడానికి నువ్వెవరు? వాళ్ళందరి ముందు అవమానంతో సగం చచ్చాను. పట్టు చీరా. పొడుగు చేతుల జాకెట్టూ నువ్వూ. అమ్మవారిలా ఉన్నావు. ఏం ఫారిన్ నైలెక్స్ చీర కట్టుకోకూడదూ? వాళ్ళు చూడు ఎలా డ్రస్ అయ్యారో-పైగా నన్నే అడుగుతున్నావే'

'వాళ్ళలా అర్ధనగ్నంగా ఉంటే మీకు ఇష్టమన్నమాట!'

'నీకిష్టం లేదనేగా! నా ఇష్టమొచ్చినట్లు నువ్వు ఉండవన్నమాట. నువ్వు నావెంట పడ్డావు కనుక పెళ్ళి చేసుకున్నాను. నేను నిన్ను పెళ్ళి కోసం అడగలేదే. నన్ను ఆంక్షల్లో పెడదామని చూస్తున్నావేమో! అదేం కుదరదు. నా ఇష్టమొచ్చినట్లు తిరుగుతాను. తెలిసిందా. ఊఁ అంటూ నన్ను కొట్టాడు. హింసించాడు. గదిలో పెట్టి తలుపేసి వెళ్ళిపోయాడు. మర్నాడు అతను బయటికి వెళ్ళాక అత్తగారు వచ్చి తలుపు తీశారు. నేను వచ్చేశాను"అని వెక్కిళ్ళ మధ్య చెప్పింది శివానీ.

"పెళ్ళికి ముందు అతని విషయం తెలుసు కదా! శివా!" అంది రమ.

"తెలుసు, రమా! కాని పెళ్ళయ్యాక మారతాడని నేను ఆశ పడ్డాను. అతనిని మార్చగలనని నాకు విశ్వాసం ఉండేది. ఒక చెడిపోయిన మనిషిని దారిలో పెట్టలేకపోతే మన చదువెందుకు అనుకునేదానిని. అతని లోపం నేను సరిదిద్దగలనని అనుకున్నాను. కానీ ఇంత త్వరగా నన్ను తిరస్కరిస్తాడని అనుకోలేదు. ఇది జీవితంలో అనుకోని సంఘటన. నేను తట్టుకోలేక పోతున్నాను. ఒక నెల రోజుల జీవితంలోనే ఇంతగా గొడవలు జరిగితే ఇంక జీవితమంతా అతనితో ఎలా గడపగలను? నా వ్యక్తిత్వాన్ని చంపుకోమంటావా? పోనీ ఎవరికోసం? విడాకులు తప్ప మార్గం లేదు, రమా! తర్వాత నాకు నా ఉద్యోగం ఉండనే ఉంది" అంది శివానీ.

"అదే మంచిదిలా ఉంది"అని నిట్టూర్చింది రమ. ★